**మే 19** – విజయానందన్‌ను తన యింట్లో పెట్టుకున్నతను తీర్థయాత్రలకు వెళ్లవలసి వచ్చింది. ఇక్కడ వుండగానే విజయానందన్ పొట్టు అమ్మన్ చెప్పినట్టు 50 వేల రూపాయల పుస్తకాలు కొనుక్కుని పెట్టుకున్నాడు. తీర్థయాత్ర విషయం తెలియగానే అరివు వచ్చి విజయానందన్‌ను తన వెంట తీసుకుని వెళ్లాడు.

తమతో వచ్చిన శివరూపన్‌ను తిరుచినాపల్లిలో ఓ ఎల్‌టిటిఇ మద్దతుదారుడి యింట్లో వారం రోజులు వుంచాక ఒక సహాయకుడి ద్వారా పోరూరులోని రాబర్ట్ పయాస్ యింటికి రప్పించాడు శివరాజన్. అక్కడనుండి అతనికి కృత్రిమమైన కాలు అమర్చడానికి జయపూర్ తీసుకెళ్లడానికి ఓ తమిళ నటుడ్ని ఏర్పాటు చేశాడు. ఇద్దరూ కలిసి మే 19 న జయపూర్‌లోని గోల్డెన్ హోటల్లో దిగారు. శివరూపన్ తన పేరు సురేష్ కుమార్ అని హోటల్ రిజిస్టర్లో రాశాడు. ఖర్చంతా శివరాజన్‌దే.

**మే 20** – పెరంబుదూరు ఎన్నికల సభకి సంబంధించి నిర్దిష్టమైన ఆదేశాలను తమిళనాడు రాష్ట్రప్రభుత్వం జారీ చేసింది. రాజీవ్ గాంధీని కలుసుకునే వారెవరో వారి జాబితా తయారుచేయించి, దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, గుర్తించి, పంపించే బాధ్యతను ఒక సబ్ యిన్‌స్పెక్టరుకి అప్పగించారు. అతనికి ఇద్దరు సహాయకుల్ని మెటల్ డిటెక్టర్‌తో సహా యిచ్చారు. మొత్తం 300 మంది పోలీసు సిబ్బందిని భద్రతా అవసరాలకోసం నియోగించారు.

శివరాజన్ అరివు యింటికి వెళ్లి విజయానందన్‌ను వెంటపెట్టుకుని వెళ్లి మడిపాకంలో వున్న శ్రీలంక స్మగ్లర్ వాసన్ యింట్లో వుంచాడు. (రాజీవ్ హత్య జరిగిన నెల రోజుల తర్వాత పోలీసులు అతన్ని అక్కణ్నుంచే నిర్బంధంలో తీసుకున్నారు) వాసన్‌ను కనకసభాపతిని తీసుకుని ఢిల్లీకి వెళ్లమన్నాడు. ఇద్దరూ కలిసి ఢిల్లీకి విమానంలో వెళ్లి అక్కడ పహాడ్‌గంజ్‌లోని కృష్ణా హోటల్‌లో దిగారు. అక్కడే వాళ్లకి ఓ తమిళ వ్యాపారవేత్త పరిచయమయ్యాడు. అతను నేపాల్‌లో స్థిరపడ్డాడు. అక్రమ వీసాలతో నేపాలీలను విదేశాలకు పంపించే వ్యాపారం చేస్తున్నాడు. ఢిల్లీలో మాకో యిల్లు కావాలి చూపిస్తావా అని అడిగారు. "మోతీ బాగ్‌లో ఓ యిల్లు వుంది చూపిస్తా" అన్నాడతను.

ఢిల్లీ శిబిరం నడపడానికి కనకసభాపతి మద్రాసు నుండి ఢిల్లీకి వెళ్లగా అటు ఢిల్లీ నుండి రాజీవ్ గాంధీ యిటు బయలుదేరి వచ్చే కార్యక్రమం పెట్టుకున్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకలలో ఎన్నికల ప్రచారం చూసుకుని 22 కల్లా మళ్లీ ఢిల్లీ తిరిగి వచ్చేయాలని ప్లాను. దేశం మొత్తం మీద పార్లమెంటు ఎన్నికలలో మొదటి విడత పోలింగు అయిపోయింది. 510 స్థానాలలో 204 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రెండో రౌండు మే 23కి, మూడో రౌండు మే 26 కి అనుకున్నారు. (రాజీవ్ హత్యతో ఆ షెడ్యూల్ మారి రెండో రౌండు జూన్ 12న, మూడో రౌండు జూన్ 15 న జరిగాయి) తమిళనాడులో రెండో విడత ఎన్నికలకై రాజీవ్ వస్తున్నారు.

తమిళనాడులో మూడు కూటములు ఎన్నికలో పోటీ చేస్తున్నాయి. ఒకటి బిజెపి (ఎవరితోనూ పొత్తు లేదు) రెండో గ్రూపు – డిఎంకె, జనతాదళ్ (వి పి సింగ్, అరుణ్ నెహ్రూ వగైరాలు), సిపిఎం. ఇక మూడో కూటమి అన్నా డిఎంకె, కాంగ్రెస్ ఐ. తమ కూటమి విజయానికి ప్రచారం చేస్తూ రాజీవ్ శ్రీ పెరంబుదూరు నుండి పోటీ చేస్తున్న శ్రీమతి మరకతం చంద్రశేఖర్ కోసం మర్నాడు అక్కడ జరిగే ఎన్నికల సభకు హాజరవ్వాలని ప్లాను చేశారు.

శ్రీ పెరంబుదూరు చెంగల్పట్టు–అణ్ణాదురై జిల్లాలో వుంది. కాంచీపురం తాలూకా. పాతపేరు భూతపురి. అక్కడ భూతపురీశ్వరుడనే శివుడి గుడి వుంది. అమ్మవారి పేరు సౌందర్యనాయకి. అదే వూళ్లో విష్ణువు గుడి కూడా వుంది. దేవుని పేరు ఆదికేశవ పెరుమాళ్. యతిరాజనాథుడని కూడా అంటారు. అమ్మవారి పేరు యతిరాజవల్లి. అక్కడ 1017లో రామానుజాచార్యులు జన్మించి విశిష్టాద్వైతం ప్రచారం చేశారు. టైము తక్కువగా వున్నపుడు విసిరేసినట్టున్న అంత చిన్న వూరికి, అక్కడ మీటింగుకి వెళ్లడం దండగ, సెక్యూరిటీ ఏర్పాట్లు చూడడం పోలీసువాళ్లకు కష్టం కూడా... అన్నాడు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు వాళప్పాడి రామమూర్తి. అయితే రాజీవ్ గాంధీ అక్కడ పెట్టి తీరాలన్నారు. "ఆవిడ మా అమ్మకు స్నేహితురాలు. వృద్ధమహిళ, పైగా దళితురాలు." అని ఆయన సెంటిమెంటు.



వాళప్పాడి రామమూర్తి

తన పనులు ముగించుకున్నాక శివరాజన్ మర్నాటి హత్య గురించి తన యింట్లో సమావేశం ఏర్పాటు చేశాడు. భాగ్యనాథన్, అరివు, మురుగన్, నళిని, హరిబాబులు సమావేశానికి వచ్చారు. మర్నాడు రాజీవ్ శ్రీ పెరంబుదూరు రాబోతున్నారన్న వార్త వున్న వార్తాపత్రిక అతని చేతిలో వుంది. అప్పుడు మర్నాటి వ్యూహం ఏమిటో అందరికీ వివరంగా చెప్పాడు. అప్పటిదాకా అందరికీ కొంచెంకొంచెమే తెలుసు. ఈ సమావేశంలోనే ఎవరి పాత్ర ఎంత, ఎవరు ఏ మేరకు ఏ బాధ్యత నిర్వహించాలి అన్నది స్పష్టీకరించాడు. ఇవన్నీ తుచ తప్పకుండా జరగాలని చెప్పాడు. హరిబాబుకి ఓ కొడక్ ఫిల్మ్ యిచ్చి "రేపు రాజీవ్ సమావేశంలో జరగబోయేవి ఫోటో తీయాలి" అని చెప్పాడు. (ఆ ఫిల్మే మొత్తం గుట్టు రట్టు చేసింది). "అంతేకాదు, రేపు మధ్యాహ్నం నళిని యింట్లో అందరూ కలవండి." అని చెప్పాడు. భాగ్యనాథన్, అరివు, మురుగన్‌లకు మీకు పెరంబుదూరులో పనేం లేదు, అనవసరంగా రావద్దు అని చెప్పాడు.

అక్కణ్నుంచి హరిబాబు రవిశంకర్ వద్దకు వెళ్లి నాకొక కెమెరా తెచ్చిపెట్టు అని కోరాడు. అతను తన దగ్గర్ను కెమెరాకు బదులు దీపక్ అనే స్నేహితుడి దగ్గరనుంచి కెమెరా తెచ్చి యిచ్చాడు.

మే 20 నాటి రాత్రి హాయిగానే గడిచిపోయింది. కుట్రదారులంతా కలిసి ఒక సినిమా చూశారు. స్త్రీలలో ఎవరూ, మర్నాడు చావుకు సిద్ధపడిన ధనుతో సహా, ఎటువంటి అధైర్యాన్ని కనబరచలేదు. మర్నాటి హత్యకు సర్వం సిద్ధం అని ఉవ్విళ్లూరుతున్నారు. మిగతా కథ వచ్చే సోమవారం. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**